క్లుప్తంగా

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లికి భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయి. శనివారం పలువురు భక్తులు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కలిసి భారీగా విరాళం అందజేశారు. వీరిలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహాయం అందించేందుకు పట్టణంలోని ఆర్యవైశ్యులు రూ 2,53,400 విరాళం ఇచ్చారు. అలాగే శివకుమార్‌లు, మదుసూధనరావులు రూ.25,000 విరాళంగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు వసంతరావు, తల్లపనేని వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, పలువురు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గుడ్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారులు మారుతీరావు, సభిహా సుల్తాన్‌లు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత లేకుండా ఉంటుందని తెలిపారు. ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది భాస్కరరావు, ఆరీఫ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనాల పరిశీలన

కనిగిరి రూరల్: పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ శనివారం కనిగిరి డివిజన్‌లోని పలు భవన నిర్మాణాలను పరిశీలించారు. మండలంలోని యడవల్లి, చాకిరాల తదితర గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లీనిక్ కట్టడాలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం డీఈ, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌ఈ కొండయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈ ఆదిశేషు, ఆరు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

హనుమంతునిపాడు: ఎంపీడీఓగా కె.లలిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముందుగా పర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కల్సారు. అనంతరం మండలానికి వెళ్లి ఎంపీడీఓ బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లాలో ఈఓఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై హనుమంతునిపాడు ఎంపీడీఓగా వచ్చారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణానికి మంచినీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వాచింగ్‌ట్యాంక్ వాల్వ్ మరమ్మతుల కారణంగా ఆదివారం నుంచి మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాధితునికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

పామూరు: స్థానిక రాఘవేంద్ర స్కూల్‌వీధికి చెందిన చీపినాపి అంకయ్య షుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఇటీవల అతనికి చికిత్సలో భాగంగా కాలు తొలగించారు. ఈసందర్భంగా తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వెంకయ్యకు శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి, అధ్యక్షుడు తిరుపతిరెడ్డి బాధితుని ఇంటి వద్ద ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరెడ్డి, బి.రంగారెడ్డి, పి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, షేక్.బాషామొద్దీన్, కే.రమణయ్య, ఎంఅనంతరెడ్డి, పి.వెంకటాద్రి, షేక్.నాయబ్‌రసూల్, శోభన్‌బాబు, ఏవీ రత్నం పాల్గొన్నారు.

గేదెలను ఢీకొని వ్యక్తి మృతి

జరుగుమల్లి: మండలంలోని జరుగుమల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఐదు గేదెలు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గేదెలను ఢీకొన్నారు. వారిలో గుడ్లూరుకు చెందిన పీ కొండయ్య (60) సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మరో వ్యక్తి గరికపాటి పుల్లయ్య తీవ్ర గాయాలతో పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వైద్య చికిత్స కోసం క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. కందుకూరు మండలం బలిజపాలెం గ్రామంలో జరుగుతున్న అంకమ్మ తిరునాళ్లకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



చంద్రబాబు తప్పు చేశాడు శిక్ష అనుభవిస్తాడు


శీలంరామును సన్మానిస్తున్న వరికూటి


జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించిన గంగాడ సుజాత, డాక్టర్ బత్తుల

- శీలం రాము పాదయాత్రలో మాట్లాడిన వరికూటి

సింగరాయకొండ: చంద్రబాబు తప్పు చేశాడు, శిక్ష అనుభవిస్తాడని దీంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. 2024వ సంవత్సరంలో మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన పాదయాత్రలో వరికూటి పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చంద్రబాబుపై 25 కేసులున్నా వ్యవస్థలను లోబరుచుకుని పబ్బం గడిపాడని, ఈ కేసుల్లో అరెస్టు కాకుండా బెయిల్ తెచ్చుకున్నాడని గుర్తు చేశారు. కానీ ఈసారి చంద్రబాబు వ్యవస్థలను లోబరుచుకోవటానికి అవకాశం లేకుండా పూర్తి ఆధారాలతో దొరికాడని, దీంట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయం లేదని కేంద్ర ప్రభుత్వ సంస్థల విచారణలో చంద్రబాబు అవినీతి బయటపడిందని గుర్తు చేశారు. తాను చేసిన అవినీతికి అడ్డంగా దొరికి అరెస్టు అయిన రోజే శీలం రాము జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పాదయాత్ర చేపట్టటం మంచి పరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా శీలం రాముకు వరికూటి పూలమాల వేసి శాలువా కప్పి అభినందించి కిలోమీటరు దూరం నడిచి పాదయాత్రలో వరికూటి పాలుపంచుకున్నారు. పార్టీ శ్రేణులు కూడా శీలం రాము పాదయాత్రలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పాత సింగరాయకొండ దేవస్థానంలో శీలం రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోకుమార్‌రెడ్డి, ఒంగోలు కార్పొరేషన్ చైర్పర్సన్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాదాసి వెంకయ్య జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. శీలం రాము మాట్లాడుతూ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడమే తన లక్ష్యమన్నారు. శీలం రాము యువసేన ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, చిమట శ్రీను, రాపూరి ప్రభావతి, ప్రళయకావేరి రోశయ్య, బొడపాటి అరుణ, చుక్కా కిరణ్‌కుమార్, సయ్యద్ ఖాజాహుస్సేన్, గొల్లపోతు సురేష్, అశహరి శ్రీను, చొప్పర వెంకన్న, అన్నం సాయినాథ్, శీలం ప్రవీణ్, పొన్నూరు సురేష్, షేక్ అల్లా, పెద్దకత్తుల విజయ్, చిన్నకత్తుల వెంకటేష్, కొక్కిలిగడ్డ హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు నేలతల్లి బాగు


కొణిజేడులో బయో ఎరువును తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

- ప్రకృతి వ్యవసాయ అధికారులు

టంగుటూరు: సేంద్రియ ఎరువులు వాడటం వల్ల తక్కువ ఖర్చుతో పంట అధిక దిగుబడిని సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని కొణిజేడు గ్రామంలో రైతు మక్కెన శ్రీను ఎకరం పొలంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మిరప పంట వేయడానికి ముందుగా భూమికి సత్తువ కోసం బయో ఎరువును ప్రకృతి వ్యవసాయాధికారులు శనివారం తయారు చేశారు. ఈ సందర్భంగా తయారీలో భాగంగా ఎరువు కావాల్సిన పదార్థాలు దేశీయ ఆవు పేడ, వేప పిండి, సూడోమోనాస్, ట్రైకో దర్మా విరిడి, నల్ల బెల్లం, ఆర్గానిక్ కంపోస్టు ఎరువు, ప్రోషన్ ఎరువు, బయోపొటాషియం వీటన్నింటినీ కలిపి బయో ఎరువును తయారు చేశారు. ఇలా తయారు చేసిన బయో ఎరువును పంట వేసే 15 రోజుల ముందుగా ఉదయాన్నే పొలంలో వేసి దున్నడం ద్వారా భూమికి సత్తువతో పాటు పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని, దీంతో పాటు పంట అధిక దిగుబడినిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి వెంకట్రావు, ఎల్ 1 వెంకట్రావు, ఎల్ 2 తుమ్మలపూడి విజయలక్ష్మి, ఐసీఆర్పీలు శృతి, హరిత, రైతులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: అవయదానానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదని, అవగాహన లేక ఇలా జరుగుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. కోటారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక త్యాగరాజుస్వామి గుడి వద్ద ఉన్న సుబ్బలక్ష్మీ మెమోరియల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవయవదానంపై నేడు అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేస్తున్నా మన దగ్గరకు వచ్చే సరికి అవయవదానం చేసేందుకు వెనుకాడుతామన్నారు. అయితే మనం అనారోగ్యం బారిన పడి వాటి అవసరం మనకు వచ్చినప్పుడు వాటి విలువ ఏంటో తెలుస్తుందన్నారు. మనిషికి ఉండే చెడు అలవాట్లు, బలహీనతల వల్ల, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దీనిలో ప్రధానం లివర్ అనారోగ్య సమస్య ఇటీవల కాలంలో అధికంగా ఉంటుందన్నారు. మనిషి శరీరంలో లివర్‌కి మాత్రమే పునరుత్పత్తి చెందే గుణం ఉందని, లివర్ దానం చేసిన వ్యక్తి, అమర్చిన వ్యక్తి ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఎవరైనా అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో, ఇతరత్రా ప్రమాదంలో చనిపోయే పరిస్థితులు ఉంటే ఆ వ్యక్తి లివర్ దానం చేయడం వల్ల మరో ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అయితే లివర్ మార్పిడి చికిత్స అనేది దాదాపు రూ. 25లక్షల ఖర్చుతో కూడుకుందన్నారు. వైద్య విధానంలో వచ్చిన నూతన పద్ధతుల వల్ల లివర్ మార్పిడి శస్త్ర చికిత్స అనేది ప్రస్తుతం సులభతరమైందని, డాక్టర్లు అనేక జాగ్రత్తలు తీసుకున్న తరువాత ఈ చికిత్సలు చేస్తారని వివరించారు. నియోజకవర్గంలో అనేక మంది ప్రస్తుతం ఈ వ్యాధితో బాధపడుతున్నా బయటకు చెప్పుకునేందుకు జంకుతున్నారని చెప్పారు. నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి సులభంగా బయటపడవచ్చని వివరించారు. చెన్నై గ్లోబల్ హాస్పిటల్ డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ లివర్‌మార్పిడి చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, కందుకూరు ప్రాంతం నుంచి లివర్ సమస్యలు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో అవగాహన కల్పించేందుకు ఉచిత లివర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పలువురికి ఉచిత లివర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కోటారెడ్డి హాస్పిటల్ ఎండీ, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ సాకేత్, డాక్టర్ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌భవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రూ.6.40 లక్షలను లబ్ధిదారులకు అందచేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందచేస్తున్న పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎందరో పేదల జీవితాలకు భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సొసైటీ చైర్మన్లు సంగు సుబ్బారెడ్డి, నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు జి.బొర్రారెడ్డి, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని గురువాజీపేట సెక్టార్ పరిధిలోని జమ్మలమడక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.అనంతరం సూపర్‌వైజర్ ఎం వీఎస్ పార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. పార్టీ రైతు, సేవాదళ్ అధ్యక్షులు శ్రీహరిరెడ్డి, సిద్దారెడ్డి, పేతురు, ఎం రమేష్, తిరుపతయ్య, సర్పంచ్ నారాయణరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

2,829 కేసుల పరిష్కారం

కందుకూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,829 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ విజయబాబు తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 10, ప్రీ లిటికేషన్ కేసులు 22, ఐపీసీ కేసులు 104, అడ్మిషన్లు 90, వివాహ సంబంధ కేసులు 6, పెట్టీ కేసులు 2,591, పిటిషన్లు 6 ఉన్నట్లు తెలిపారు. లోకా అదాలత్ కోర్టుల్లో కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరిస్తామని, కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగే ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజలు లోక్ అదాలత్ కోర్టులపై అవగాహన పెంచుకుని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ నిఖిల్‌రెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి. రమేష్‌బాబు, ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా బీవీ శేషయ్య, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే షంషుద్దీన్, ఎస్ పవన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు వై సాంబశివరావు, సీహెచ్ హరికృష్ణ, వి.శ్రీధర్‌నాయుడు, ఏజీపీ హరికోటేశ్వరరావు, జె.రాజేంద్రబాబు, న్యాయవాద సంఘ అధ్యక్షుడు ఎం మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో 1052 కేసులు పరిష్కారమైనట్లు కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 103, సివిల్ కేసులు 4, భరణం కేసులు 5, ఎస్ టీసీ కేసులు 940 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు తెలిపారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలన్నారు. చిన్న చిన్న పొరపాటు, క్షణికావేశంతో జరిగే గొడవలు, మనస్పర్థలతో కేసులు పెట్టుకుని, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకుని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, పారాలీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి భరత్‌చంద్ర

144 సెక్షన్ అమలు

ఉలవపాడు: మండల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎటువంటి సభలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. నలుగురికి మించి బహిరంగ ప్రదేశాల్లో గుమికూడరాదని తెలిపారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందస్తుగా మండల టీడీపీ నాయకులు సుబ్బారావు, వాసు, శ్రీను తదితరులను గృహంలోనే ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే కార్యక్రమాలు చేయవద్దని తెలియచేశారు.

మాలకొండ ఆదాయం రూ.14,66,148

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.14,66,148 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.29,120, తలనీలాలు రూ.67,300, ప్రత్యేక దర్శనం రూ.4,57,800, లడ్డుప్రసాదాలు రూ.2,04,895, అన్నదానం రూ.6,05,132, రూమ్ అద్దెలు రూ.37,170 వచ్చినట్లు పేర్కొన్నారు.

లక్ష్మీ నృసింహ స్వామికి పూజలు

మద్దిపాడు: శ్రీపృధులగిరి పై వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణం మారుతీ చార్యులు స్వాముల వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీసమేత నృసింహస్వాముల వారికి సహస్రనామపూజ, శతబిల్వార్చన పూజ చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి స్వాములవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఆవరణ భక్తులతో కిక్కిరిసింది.


పూజలు అందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ సుబాని

పామూరు: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సీహెచ్‌సీ డాక్టర్ సుబానీ అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశాలలో శనివారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఈసీజీ, బీపీ, షుగర్, యూరినల్ పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన అవగాహనలో డాక్టర్ సుబాని గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చిన్నపాటి వ్యాధులకు గురైనా సొంత వైద్యం కాకుండా వైద్యశాలలో డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు


గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని డాక్టర్ మూరక ప్రతాపురెడ్డి అన్నారు. స్థానిక ఆస్పత్రిలో శనివారం గర్భిణులు, బాలింతలకు ప్రధానమంత్రి మాతృ వందన పథకంపై ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, షుగరు, బీపీ, క్షయ, హెచ్‌ఐవీ, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృ యోజన పథకంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ చెన్నయ్య, సూపర్‌వైజర్ పద్మవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ భవన్ మంజూరుపై హర్షం

మార్కాపురం టౌన్: పట్టణంలోని బీసీలందరికీ కలిపి బీసీ భవన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు అన్నారు. బీసీల ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. బీసీ భవన్‌కు పూలసుబ్బయ్య కాలనీలో 1300 గజాల స్థలాన్ని కేటాయిస్తూ ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. బీసీ భవన్ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. బీపీ మండల్ యాదవ్ విగ్రహం ఏర్పాటుకు కూడా ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ కూడా ఆమోదం తెలిపారన్నారు. బీసీ సంఘ నాయకులు రంగస్వామి గౌడ్, నల్లబోతుల అచ్చయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, టీపీ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ప్రసాద్, బండారు శ్రీను, అల్లంరాజు శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీల ఆధ్వర్యంలో సన్మానం

పట్టణానికి అంబేడ్కర్ భవన్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమ్ కుమార్, సతీష్, చెన్నకేశవులు, ఎం.శ్రీనివాసులు, వంశీ, రోజ్‌లిడియా కలిసి సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు

కొనకనమిట్ల: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలమం, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో విశేష పూజలు చేశారు. వెలుగొండలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రామదూత క్షేత్రంలో..

కొనకనమిట్లలోని రామదూత క్షేత్రంలోని శనీశ్వరాలయంలో శనివారం ప్రత్యేక హోమాలు జరిపించారు. శనీశ్వరునికి తైలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ వేదపండితులు అకలంకం వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలు యక్కంటి తురుపతిరెడ్డి, ఒద్దుల చలమారెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

మాదిగ ఉద్యోగుల మహాధర్నాను జయప్రదం చేయండి


సన్మానం అందుకున్న ఎంఈఎఫ్ ఉద్యోగులు

ఒంగోలు: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈనెల 18, 19 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు బొంత ఏసుదాసు అన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా కార్యాలయం సంతపేటలో శనివారం ప్రారంభించారు. ఎంఈఎఫ్ సీనియర్ నాయకుడు కేఎస్ ప్రకాశరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన సుంకర ఆదాం, గుంటగాని భాస్కర్, గంధం ప్రసాద్‌లను, ఏకే విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా నియమితులైన కుడుమల అనీల కుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పిచ్చయ్య, అమ్మయ్య, భాస్కర్‌రావు, జాలారావు, నిరంజన్, బాబు రావు, ఆంజనేయులు, శ్యాం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.